# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



నమ్మలేని నిజాలు

దస్కోలహరి
స్వరకూర్పు విధాత
బంగారు కొండ.

గుబ్బపు స్వారీ
సాంప్రదాయ వాహనం
మళ్లీ కొత్తగా.

జ్ఞాన వాహిని
పాఠశాల జాహ్నవి
మురికి కూపం.

జంపన్నవాగు
పోరుబిడ్డలగాథ
కథా వాహిని.

యుద్ధభయాలు
ప్రాణాలు పిడికిట్లో
జనం పరుగు



- రేడియమ్
సెల్: 9291527757



శ్రీనిజాలు

హైద్రాబాద్ నగరంలో
ఎటుచూసిన బేహారులు !
నానాటికి పెరుగుతున్న
కోటినోటుల కుబేరులు !

ఓ భాగ్యవంతులారా
పేదవాళ్లనాదుకోండి !
భాగ్యనగరంలో ఉంటు
అనాధలను సాదుకోండి !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ | గురువారం 3-3-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 176 | పేజీలు: 6 | వెల: రూ.1/-


# ప్రగతి పథంలో తెలంగాణ రాష్ట్రం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 2: తెలంగాణ అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. తెలంగాణలో మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. బేగంపేటలోని గ్రాండ్ కాకతీయలో నిర్వహించిన సీఐఐ సమావేశానికి మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

టీఆర్ఎస్ ఏడున్నరేండ్ల పాలనలో తలసరి ఆదాయం బాగా పెరిగిందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ. 2.78 లక్షలకు చేరిందన్నారు. పశ్చిమ బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్ర తర్వాత పెద్ద ఆర్థిక వ్యవస్థ మనదే అని కేటీఆర్ స్పష్టం చేశారు. 20 ఏండ్ల క్రితం హైదరాబాద్‌లో పెద్దగా కంపెనీలు లేవు. ఇప్పుడు హైదరాబాద్‌లో అనేక ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు ఉన్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆవిష్కరణలు, స్టార్టప్‌లను బాగా ప్రోత్సహిస్తుందన్నారు. తెలంగాణలో ఎన్నో స్టార్టప్‌లు వచ్చి విజయవంతంగా నడుస్తున్నాయి. తమ ప్రభుత్వం తెచ్చిన టీఎస్ ఐపాస్ బాగా విజయవంతమైందన్నారు. పరిశ్రమలకు 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. 500 మీటర్ల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న పరిశ్రమలకు సత్వర అనుమతి ఇస్తున్నామని చెప్పారు.

మిషన్ భగీరథ పథకాన్ని కేంద్రంతో పాటు చాలా రాష్ట్రాలు కాపీ కొట్టాయని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్లలోనే పూర్తి చేశాం. కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను ప్రతి ఎకరాకు అందిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో కూడా తెలంగాణ అభివృద్ధి చెందిందని తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయన్నారు. పంజాబ్ కంటే అధికంగా వరి ధాన్యాన్ని పండించామని చెప్పారు. ఏ ప్రధాని, ఏ ముఖ్యమంత్రి కూడా రైతులకు లబ్ధి చేసే చర్యలు తీసుకోలేదు. కానీ సీఎం కేసీఆర్ వ్యవసాయ పెట్టుబడి కోసం రైతుబంధు కింద సంవత్సరానికి రెండుసార్లు ఎకరాకు రూ. 5 వేల చొప్పున ఇస్తున్నారని తెలిపారు. గత ఏడేండ్లలో రాష్ట్రంలో పచ్చదనాన్ని 24 నుంచి 31 శాతానికి పెంచామని కేటీఆర్ పేర్కొన్నారు.

# ప్రాణదానం మనందరి చేతుల్లో ఉంది: ఉపరాష్ట్రపతి




అమరావతి, మార్చి 2:ఆపత్కాలంలో ఒకరి ప్రాణాలను కాపాడటాన్ని మించిన ఆనందం దేనిలోనూ దొరకదని గౌరవ భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. దయ, కరుణ, జాలి వంటివి సమాజంలో పెంపొందించేందుకు ఒకరికొకరు తోడుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారాయన. బుధవారం విజయవాడలోని స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో జరిగిన సిపిఆర్ అవగాహన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. హఠాత్తుగా గుండెపోటు వచ్చిన వ్యక్తికి అత్యవసరంగా చికిత్సన అందించే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) పద్ధతిని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఎవరికైనా గుండెపోటు వచ్చిందంటే వారి గుండె పనిచేయడం మందగించిందని అర్థం. ఆ సమయంలో ప్రథమ చికిత్స అందిందా లేదా అన్న అంశంపైనే ఆ వ్యక్తి ప్రాణాలు ఆధారపడి ఉంటాయి. అప్పుడు ప్రథమ చికిత్సను అందించే సీపీఆర్ పద్ధతిని నేర్చుకుని ఉంటే ఆ వ్యక్తి ప్రాణాలను మనం కాపాడిన వారమవుతాం' అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో జీవనశైలిలో వస్తున్న మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయన్నారు. వీటి ద్వారా గుండెపోటు కేసులు పెరుగుతున్నాయన్న విషయాన్ని ఉపరాష్ట్రపతి గుర్తుచేస్తూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా సీపీఆర్ నేర్చుకోవడం వల్ల మన కళ్లముందు ఎవరైనా గుండెపోటుకు గురయితే వారికి ప్రాణదానం చేయవచ్చున్నారు. ఒకరి ప్రాణాలను కాపాడటం కూడా మన బాధ్యతేననే విషయాన్ని ప్రతి పౌరుడూ గుర్తెరగాలన్నారు. పాఠశాలల్లోనూ సీపీఆర్ కు సంబంధించిన శిక్షణ అందించాల్సిన అవసరాన్ని ఉపరాష్ట్రపతి నొక్కిచెప్పారు. చిన్నప్పటినుంచే విద్యార్థుల్లో దయ, కరుణ, నైతిక విలువలు తదితర అంశాలతోపాటు ప్రాణాలు కాపాడటంపైనా అవగాహన కల్పించాలన్నారు. కాగా, గుండెపోటుకు గురైన వారికీ అత్యవసర పరిస్థితులలో చికిత్స అందించేందుకు రూపొందించిన ఏ.ఈ.డి. పరికరం పనిచేసే విధానాన్ని వైద్య బృందం ప్రదర్శించింది.

# యమస్పీడుగా సిలబస్! విద్యార్థుల్లో పెరుగుతున్న టెన్షన్..

హైదరాబాద్, మార్చి 2:ఇంటర్ విద్యార్థులకు పరీక్షల టెన్షన్ పట్టుకుంది. ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మొదటి ఏడాది పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి మే 2 వరకు జరగనున్నాయి. ఏప్రిల్ 21 నుంచి మే 5 వరకు ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా గడువు దగ్గరకు రావడంతో ప్రిపరేషన్ హడావుడి పెరిగింది. సిలబస్ పూర్తి కాని చోట అదనపు క్లాసులు నిర్వహించి అధ్యాపకులు సిలబస్‌ను చకచకా లాగించేస్తున్నారు. సిలబస్‌ను పూర్తి చేయడంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల కంటే ప్రైవేట్ కాలేజీలు కాస్త ముందున్నట్లుగా తెలుస్తోంది. ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 23 నుంచి ఏప్రిల్ 8 వరకు జరగనున్నాయి. ఈక్రమంలో సరైన ప్రణాళికతో ప్రిపరేషన్ మొదలు పెట్టాల్సి ఉంటుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గత అక్టోబర్‌లో ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాసిన అనుభవం ఉండటంతో కొంత వరకు పరీక్షలు ఎలా జరుగుతాయన్న అవగాహన వారికి ఉంటుంది. కానీ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇదే మొదటి బోర్డు పరీక్ష. వీరు టెన్త్ బోర్డు పరీక్ష కూడా రాయకుండా కరోనా కారణంగా ప్రమోటై ఇంటర్‌కు వచ్చారు. దీంతో ఇంటర్ విద్యార్థుల్లో పరీక్షల టెన్షన్ పట్టుకుంది.

వివేక వాణి




చరిత్రలో నేటినిజం



తం|| అంకిత భావముగ పని చేయగ
లంకా ధీపు వైరి మెచ్చి లక్ష్యముగ నిడునే
శంకరునకు కింకరుడగు
శంకరు మహాదేవనునకు శక్యమౌ తెలియునే !!

(మార్చి 3 సంగీతవేత్త శంకరు మహాదేవన్ జయంతి...)



-రాధశ్రీ
సెల్: 9494481210

# ఉక్రెయిన్ ఎఫెక్ట్.. 110 డాలర్లకు చేరిన బ్యారెల్ ఇంధనం ధర

న్యూఢిల్లీ, మార్చి 2:ఉక్రెయిన్ సంక్షోభం ఇంధనంపై ప్రభావం చూపుతోంది. రష్యా దాడి వల్ల ఆయిల్ ధరలు ఆకాశాన్నంటాయి. అత్యవసర చర్యలు తీసుకున్నా.. ప్రస్తుతం ఇంధనం బ్యారెల్ ధర 100 డాలర్లకు చేరింది. ఉక్రెయిన్ వార్ ప్రభావం పడకుండా ఉంచేందుకు చర్యలు తీసుకున్నా.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మాత్రం నింగికెగురుతున్నాయి. ఆయిల్ ధరలను సూచించే బ్రెంట్ క్రూడ్‌లో.. బ్యారెల్ ధర 110 డాలర్ల మార్క్‌ను చేరింది. గడిచిన ఏడేళ్లలో ఇదే అత్యధిక ట్రేడింగ్ ధర కావడం విశేషం. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ సభ్య దేశాలు అత్యవసరం 60 మిలియన్ల బ్యారెళ్ల ఇంధనాన్ని రిలీజ్ చేయడానికి అంగీకరించిన తర్వాత కూడా ముడి చమురు ధరలు పెరగడం శోచనీయం. బ్యారెల్ ఇంధనం ధర పెరగడంతో.. పెట్టుబడిదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సంక్షోభం నేపథ్యంలో అనేక దేశాలు రష్యాపై ఆంక్షలు విధిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఖనిజాలు, దినుసుల ధరలు పెరుడుతున్నాయి. గత నెలలోనే గోధుమ ధర 30 శాతం పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇంధనం ఉత్పత్తి చేస్తున్న పెద్ద దేశాల్లో రష్యా ఒకటి. ఉక్రెయిన్‌పై వార్‌తో ఇంధనం లేదా గ్యాస్ సరఫరాపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు.

# రష్యాలో ఉక్రెయిన్ రాయబార కార్యాలయం మూసివేత

న్యూఢిల్లీ, మార్చి 2:రష్యా వర్సెస్ ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఉక్రెయిన్ పై రష్యా భీకర దాడులు చేస్తోంది. కీలక నగరాలను ఆక్రమించుకుంటూ ముందుకెళ్తోంది. అయితే ఈ యుద్ధం నేపథ్యంలో రష్యాలోని ఉక్రెయిన్ రాయబార కార్యాలయాన్ని మూసేశారు. అక్కడి సిబ్బంది కూడా వెళ్లిపోయారు. దీంతో పాటు ఉక్రెయిన్ రాయబార కార్యాలయ గేట్లను కూడా సీల్ చేసేశారు. ఇక.. కార్యాలయంపై ఉండే ఉక్రెయిన్ జాతీయ జెండాను కూడా కిందికి దించేశారు. రష్యా సేనలు దూసుకువెళున్నాయి. ఉక్రెయిన్‌లోని ఒక్కొక్క నగరాన్ని చేజిక్కించుకుంటున్నాయి. తాజాగా ఖేర్సన్ పట్టణాన్ని రష్యా బలగాలు ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దక్షిణ ప్రాంత నగరమైన ఖేర్సన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ కార్యాలయం పేర్కొన్నది. ఒకవేళ ఖేర్సన్ నగరం రష్యా చేతుల్లోకి వెళ్తే, అప్పుడు ఆ దేశం స్వాధీనం చేసుకున్న అతిపెద్ద ఉక్రెయిన్ నగరం ఇదే అవుతుంది.

# పుతిన్ యుద్ధ నేరస్తుడు : బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్

లండన్, మార్చి 2:: ఉక్రెయిన్‌పై రష్యా దమనకాండ కొనసాగుతుండగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్‌పై అమెరికా సహా పలు దేశాలు భగ్గుమంటున్నాయి. పుతిన్‌ను యుద్ధ నేరస్తుడిగా బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ అభివర్ణించారు. పౌర స్థావరాలపై రష్యా బాంబులు కురిపిస్తున్న క్రమంలో పుతిన్‌పై ఆయన మండిపడ్డారు. ఉక్రెయిన్‌పై దాడిని ఆపాలని చర్చలు పునరుద్ధరించాలని పాశ్చాత్య దేశాలు డిమాండ్ చేస్తుండగా రష్యా యుద్ధాన్ని కొనసాగిస్తోంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రధాన నగరాల్లో రష్యన్ సేనలు కాల్పులతో విరుచుకుపడుతున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ నుంచి భారత విద్యార్థులను సురక్షితంగా తరలించేందుకు సహకరించేందుకు రష్యా అంగీకరించింది. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పుతిన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు.

భారత విద్యార్థులు ఖార్కివ్‌ను వీడి వెళ్లేందుకు యుద్ధానికి ఆరు గంటల విరామం ప్రకటించామని రష్యా పేర్కొంది. కాగా ఖర్కివ్‌లో రష్యన్ కాల్పులను యుద్ధ నేరంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమర్ జెలెన్‌స్కీ అభివర్ణించారు. ఇక ఉక్రెయిన్‌కు అమెరికా అండగా నిలుస్తుందని అగ్రరాజ్య అధ్యక్షుడు జో బైడెన్ పునరుద్ఘాటించారు. అయితే తాము నేరుగా రష్యా సేనలతో తలపడబోమని చెప్పారు. తమ మిత్రపక్షాలతో కలిసి నాటో పరిధిలోని ప్రాంతాలను అమెరికా కాపాడుకుంటుందని స్పష్టం చేశారు.

# ఆర్కే బీచ్‌లో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి

అమరావతి, మార్చి 2:ఆర్కే బీచ్ వద్ద సముద్రం నీటిలో మునిగి ఇద్దరు మృతి చెందారు. మరొకరిని అక్కడే ఉన్న మత్స్యకారులు సురక్షితంగా బయటకులాగారు. మహా శివరాత్రి ఉత్సవాలకు హాజరయ్యేందుకు వచ్చి సముద్రంలో ఈతకు దిగి గల్లంతైనట్లుగా సమాచారం. మృతులు ఈస్ట్ పాయింట్ కాలనీకి చెందిన కే రోహిత్, పెద్ద జాలరిపేటకు చెందిన జే సింహాద్రిగా గుర్తించారు.కాగా, సముద్రంలో ఈతకు దిగిన తర్వాత రోహిత్ అనే విద్యార్థికి మూర్ఛ రావడంతో నీట మునిగిపోయాడు. పవన్ అనే మరో విద్యార్థి అలల తాకిడికి కొట్టుకుపోయాడు. స్థానిక ఈతగాళ్లు చొరవ తీసుకుని అతడిని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

రోహిత్, సింహాద్రి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రాణాలతో బయటపడిన పవన్‌ను చికిత్స నిమిత్తం దవాఖానలో చేర్చారు. ఈ ఘటనపై ఎంవీపీ సీఐ రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవిలో మరుమల్లెలు
వర్షాకాలపు జల్లులు
చలిబాధల రానీయని
కౌగిలి నిత్తురు తల్లులు!

చీడను తిను పిచ్చుకలను
మనిషి తరిమి తరిమేసెను
కీటకాలు పెరిగి పెరిగి
పంటల నంతా మేసెను!

సిరు లొసగే కల్పవల్లి
జలముల ఆనందవల్లి
సహనానికి సస్యానికి
ప్రతిరూపం భూమి తల్లి!

పెరుగుతుంది జనసాంద్రత
పెరుగుతుంది ధనమంద్రత
పెరగని భూమిని పొదుపుగ
వాడుకొనుట కదా ఘనత!

ఎందుకు చేశా వనది
ఎందుకు వేశా వనది
అన్నింటిని కలుపుకొని
ప్రవహించే జీవనది!

పంటలు పండని పాడు
పచ్చిక నెలవౌ బీడు
ఎవరే మంటే నేమి
పసుల తనే కాపాడు!

ఆవు పేడ ఔషధము
మేక పెంటికలు బలము
నీ విసర్జనలు మనిషీ !
అందరికీ అసహనము!

కోళ్ళను పెంచుట సహజము
దూళ్ళను పెంచుట సహజము
రొయ్యలు చేపలు పెంచుట
అయ్యారే ఏ మనెదము?!

మత్స్యము ఒక అవతారము
కూర్మము ఒక అవతారము
వరాహ మవతార మైన
అయ్యె మనిషి కాహారము!




ప్రసిద్ధ కవి, కథకుడు రచయిత, విశ్రాంత తెలుగు పండితుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, అభినవ దాశరథిగా పేరుగాంచిన **దోరవేటి** కలం నుండి జాలువారిన మణిపూసల కావ్యమే **"ప్రకృతి పరిమళం"**. ఇవన్ని కూడా ముక్తకాలే. ఈ ప్రకృతిలో భాగమైన అనేక రకాల చెట్లు, మొక్కలు, జంతువులు, పక్షులు, కీటకాలు మొదలగు వాటిని పలుకరిస్తూ, **వడిచర్ల సత్యం** సృష్టించిన మణిపూసల కవితా ప్రక్రియలో దోరవేటి కావ్యరచన సాగడం గమనార్హం. తెలుగు సాహిత్యంలో విశేష జనాదరణ పొంది, ఆబాల గోపాలాన్ని అలరించిన మణిపూసల ప్రక్రియలో వచ్చిన "ప్రకృతి పరిమళం" నేటి నిజం పాఠకుల కోసం....! -సంపాదకులు.

గలగలమని పరుగిడును
కళకళగా కనబడును
అడ్డు కట్ట వేస్తే సెల
యేరు సస్యముల నిడును!

అందానికి చిరునామా
అరుల నెదిర్చే ధీమా
గన తరమా గిరులసొగసు
అంబుధినాపే గరిమా!

వేల పూవులను జొచ్చి
మకరందమునే తెచ్చి
శ్రమకోర్చి యిచ్చెదవే
తేనె టీ గిదేం పిచ్చి!

చెట్టు గాటు కన్నీరే
టపటపమని అది కారే
వగరై జిగురై రబ్బరు
గా సాగగ నది మారే!

పురుగుల తిను దర్దురము
కప్పల తిను నండజము
పాముల వేటాడి తినును
కదా మరో అండజము!

దైవాంశ కదే తావు
ధరణిని కామ ధేనువు
పాడిపంటలకు తానె
నీడయయ్యె గద ఆవు!

జంతువులకు ఆహారం
జగతికి పచ్చల హారం
చాపకు చీపురు కైనా
గడ్డి యౌను ఆధారం!

మండును ఎండలు నింగిన
పండును వరి యాసంగిన
మామిడి,ముంజలు,చెరుకులు
పుచ్చకాయలకు లొంగున ?

వలసకు వచ్చిన పులుగు
వగపును బాపెడి అలుగు
కాకి గూటిలోన కోకి
లమ్మ బిడ్డలయ్యి పెరుగు!

# పుతిన్ భారీ మూల్యం చెల్లించక తప్పదు : బైడెన్



వాషింగ్టన్, మార్చి 2:: అమెరికా ఉభయసభలను ఉద్దేశించి అధ్యక్షుడు జో బైడెన్ ప్రసంగించారు. ఉక్రెయిన్ సంక్షోభంపై మాట్లాడిన ఆయన ఆ మారణహోమానికి పుతిన్ కారణమన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారీ మూల్యం చెల్లించక తప్పదన్నారు. పుతిన్ ప్రభుత్వం అవినీతి అధికారులు, వ్యాపారవేత్తలతో భ్రష్టుపట్టిందన్నారు. రష్యాపై పోరులో యూరోప్ దేశాలతో కలిసి పనిచేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

రష్యాకు చెందిన రాజకీయ సంపన్నుల వివరాలను తాము సేకరించినట్లు ఆయన చెప్పారు. వారిపై త్వరలో ఆంక్షలను అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉక్రెయిన్ అంశంలో అమెరికా, నాటో దేశాలు ఒక్కటిగా ఉన్నట్లు ఆయన చెప్పారు. పుతిన్ భారీ మూల్యం చెల్లించుకుంటారని, చరిత్ర అదే చెబుతోందని, నియంతలు తమ దూకుడు తగ్గించకుంటే, దాంతో మరి ంత నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఉక్రెయిన్ విషయం పశ్చిమ దేశాలను అంచనా వేయడంలో పుతిన్ విఫలమైనట్లు ఆయన తెలిపారు.

రష్యాను ఢీకొట్టేందుకు తాము రెఢీగా ఉన్నామన్నారు. ఆరు రోజుల క్రితం స్వేచ్ఛా ప్రపంచ పునాదులను పుతిన్ కదిపారని, ఆయనకు తగినట్లు మార్చుకోవాలని చూశారన్నారు. కానీ పుతిన్ అంచనాలు దారుణంగా దెబ్బతిన్నట్లు బైడెన్ ఆరోపించారు. ఉక్రెయిన్ ప్రజలపై అమెరికా అధ్యక్షుడు ప్రశంసలు కురిపించారు. ఉక్రెయిన్ ప్రజలు రష్యా దూకుడు పట్ల బలమైన గోడలా నిలిచారని, దీన్ని పుతిన్ ఊహించలేకపోయినట్లు బైడెన్ తెలిపారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ప్రజలను కీర్తిస్తూ.. భయంలేకుండా, ధైర్యం, పట్టుదలతో ఉక్రేనియన్లు ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచినట్లు చెప్పారు. అమెరికా గగనతలంలో రష్యా విమానాలను నిషేధిస్తున్నట్లు బైడెన్ తెలిపారు.

# 'సాంకేతిక విజ్ఞానంపై ఆధారపడిన అభివృద్ధి' అనే అంశంపై ఏర్పాటైన వెబినార్‌ను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 2:బడ్జెటు లో పేర్కొన్న అంశాలను ఒక నిర్ణీత కాలం లోపల అమలు చేసేందుకు సంబంధిత వర్గాల వారిని సంప్రదించడాని కి, ఆయా వర్గాల ను ప్రోత్సహించడాని కి వరుస గా నిర్వహిస్తున్న బడ్జెటు అనంతర వెబినార్ లలో భాగం గా ఏర్పాటైన ఏడో వెబినార్ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న ప్రసంగించారు. ఆయన ఈ వెబినార్ ల తాలూకు ఔచిత్యాన్ని గురించి వివరిస్తూ, "బడ్జెటు యొక్క వెలుగు లో, ఏ విధం గా త్వరిత గతి న, ఎలా ంటి అంతరాయాలు లేకుండా, సర్వోత్తమ ఫలితాల ను సాధించుకోవడం కోసం ఈ కేటాయింపుల ను అమలు పరచగలమన్నది మనః అందరి ఉమ్మడి ప్రయాస కావాలి" అన్నారు.

ఈ ప్రభుత్వాని కి విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక విజ్ఞానం అనేది ఒక ఒంటరి రంగం కాదు అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక వ్యవస్థ తాలూకు రంగం లో ఈ దృష్టి కోణం డిజిటల్ ఇకానమి, ఇంకా ఫిన్ టెక్ ల వంటి రంగాల తో జతపడి ఉంది. ఇదే విధం గా మౌలిక సదుపాయాల కల్పన మరియు సార్వజనిక సేవల అందజేత తో ముడిపడిన దృష్టి కోణం లో ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఒక ప్రధానమైన పాత్ర ను పోషించవలసి ఉంది. "సాంకేతిక విజ్ఞానం అనే దానిని దేశ ప్రజల సశక్తీకరణ తాలూకు ఒక మాధ్యమం గా మేం చూస్తున్నాం. దేశం స్వయంసమృద్ధం కావాలి అంటే గనక దానికి సాంకేతిక విజ్ఞానం ఒక మూలాధారం అని మనం విశ్వసిస్తున్నాం. ఈ సంవత్సరం బడ్జెటు లో సైతం ఇదే విధమైనటువంటి దృష్టికోణం ప్రతిబింబించింది" అని ప్రధాన మంత్రి అన్నారు. అభివృద్ధి చెందిన దేశం అయిన యుఎస్ఎ కూడా ప్రస్తుతం దీనిని గురించి మాట్లాడుతోందని ప్రధాన మంత్రి చెప్తూ యుఎస్ఎ అధ్యక్షుడు శ్రీ జో బైడెన్ ప్రసంగాన్ని గుర్తు కు తీసుకు వచ్చారు. ఆ ప్రసంగం లో శ్రీ బైడెన్ స్వయంసమృద్ధి యొక్క ప్రాముఖ్యాన్ని నొక్కిచెప్పడం గమనార్హం. "కొత్త గా ఉనికి లోకి వస్తున్న ప్రపంచ వ్యవస్థ ల వెలుగు లో, మనం ఆత్మనిర్భరత పట్ల శ్రద్ధ తీసుకొంటూ ముందుకు సాగవలసిన అవసరం ఉంది" అని ఆయన అన్నారు.

ఆర్టిఫిశియల్ ఇంటెలిజెన్స్, జియో-స్పేశల్ సిస్టమ్స్, డ్రోన్స్ ,సెమి-కండక్టర్స్, జినోమిక్స్, అంతరిక్ష సంబంధి సాంకేతిక విజ్ఞానం, ఔషధ నిర్మాణం, 5జి సంబంధి స్వచ్ఛ సాంకేతికత ల వంటి కొత్త గా వృద్ధి లోకి వస్తున్న రంగాల కు బడ్జెటు పెద్ద పీట వేసింది అంటూ శ్రీ నరేంద్ర మోదీ ప్రముఖం గా ప్రస్తావించారు.

5జి స్పెక్ట్రమ్ వేలం పాట కోసం ఒక స్పష్టమైన మార్గసూచీ ని అంతేకాకుండా ఒక దృఢమైన 5జి ఇకో-సిస్టమ్ తో సంబంధం కలిగిన డిజైన్ ప్రధానమైన తయారీ రంగం కోసం ఉత్పత్తి తో ముడిపడిన ప్రోత్సాహక (ప్రొడక్టివిటీ లింక్ డ్ ఇన్ సెంటివ్.. పిఎల్ఐ) పథకాల ను గురించి బడ్జెటు పేర్కొనడమైంది. ఈ రంగం లో ప్రైవేటు రంగం తన ప్రయాసల ను పెంచాలి అని ఆయన సూచించారు. 'సాంకేతిక విజ్ఞానం అనేది స్థానికం, మరి విజ్ఞాన శాస్త్రం అనేది సర్వాధికారయుక్తం' అనే సిద్ధాంతాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, "మనకు విజ్ఞాన శాస్త్ర సిద్ధాంతాలు తెలిసినవే. కానీ, మనం జీవనం లో సౌలభ్య సాధన కోసం సాంకేతిక విజ్ఞానాన్ని వీలయినంత ఎక్కువ స్థాయి లో ఎలా ఉపయోగించుకోవచ్చనే దానికి పెద్ద పీట వేయాలి" అని ఆయన అన్నారు. గృహ నిర్మాణం, రైలు మార్గాలు, వాయు మార్గాలు, జల మార్గాలు, ఇంకా ఆప్టికల్ ఫైబర్.. వీటిలో పెట్టుబడి ని గురించి కూడా ప్రధాన మంత్రి ప్రస్తావించారు

# నాలుగు గంటల్లోగా ఖార్కీవ్‌ను ఖాళీ చేసేయాలి : భారతీయులకు భారత ఎంబసీ సూచన

న్యూఢిల్లీ, మార్చి 2:ఖార్కీవ్ లో ఉన్న భారతీయ విద్యార్థులందరూ తక్షణమే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని భారత ఎంబసీ మరోమారు సూచించింది. బుధవారం సాయంత్రం కల్లా పెసోచిన్, బాబే, బెజ్లియుడోవా వైపు తరలి వెళ్లాలని భారత ఎంబసీ ట్విట్టర్ వేదికగా సూచించింది. కేవలం నాలుగు గంటల్లోగా ఖార్కీవ్‌ను ఖాళీ చేయాలని ఎంబసీ పేర్కొంది. 'ఖార్కీవ్‌లోని భారతీయ విద్యార్థులందరీ ముఖ్య సూచన. వారి రక్షణ కోసం ఖార్కీవ్‌ను తక్షణమే వదిలి వెళ్లాలి. సాయంత్రం 6 గంటల కల్లా వదిలి వెళ్లండి. పెసోచిన్, బాబే, బెజ్లియుడోవ్కా వైపు వీలైనంత త్వరగా వెళ్లండి.' అంటూ భారత ఎంబసీ సూచించింది.

ఉక్రెయిన్‌లో రష్యా దాడులను ఉధృతం చేసింది.

రాజధాని కీవ్ సహా ఖార్కీవ్ వంటి పెద్ద పట్టణాలు బాంబుల మోతతో దద్దరిల్లుతున్నాయి. ఎటుచూసినా కూలిన భవనాలు, భారీగా ఎగసిపడుతున్న పొగలతో భీతావహ దృష్యాలు కనిపిస్తున్నాయి.

దేశంలో రెండో పెద్ద పట్టణమైన ఖార్కీవ్‌పై (ఐప్త్రజీతీనితిల) రష్యన్ వైమానిక దళం పెద్దఎత్తున బాంబుల వర్షం కురిపిస్తున్నది.

దీంతో 21 మంది మృతిచెందగా, వంద మందికిపైగా గాయపడ్డారు. నగరంలోని ఓ ప్రసూతి దవాఖానపై (ఓజీబివతీనితిబిఎ ష్త్రనీఎవ) వైమానిక దళం గుండ్ల వర్షం కురిపించడంతో ఇద్దరు మృతిచెందగా, మరో 16 మంది గాయపడ్డారు.

# ఈ నెల 4 తేది నుండి పోలీస్ క్రీడలు ప్రారంభం

హైదరాబాద్, మార్చి 2:ఈ నెల 4వ తేది 6వ తేది వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ అండ్ మీట్ 2022 నిర్వహిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి ప్రకటించారు. నిరంతరం విధులు నిర్వహించే పోలీసులు ఆటవిడుపుగా ప్రతి ఏడాది ఒకమారు నిర్వహించే వరంగల్ పోలీస్ క్రీడలను ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లుగా వరంగల్ కమిషనరేట్ పోలీసులకు క్రీడలను నిర్వహిస్తున్నట్లుగా పోలీస్ కమిషనర్ తెలియజేసారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలు ఈ నెల నాల్గవ తేదిన హన్మకొండ లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం నందు ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయి.

ఈ క్రీడా పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో డివిజనల్ వారిగా పోలీస్ అధికారులు సిబ్బంది పోటీ పడనున్నారు. ఈ క్రీడల్లో సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్ల పాటు, సిటి ఆర్మ్‌డ్ విభాగం, ట్రాఫిక్, సిసిఆర్ బి, స్పెషల్ బ్రాంచ్, ఐటీ మరియు సైబర్ విభాగాలకు చెందిన పురుష, మహిళ పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ క్రీడా పోటీల్లో పాల్గొనున్నారు. ఈ క్రీడలకు ముగింపు వేడులకు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జ్వాలా గుత్తా హజర్ కానున్నట్లుగా పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

# కీవ్‌ను కాపాడుకోవడం కోసం 'పెట్రో బాంబు'లతో రెడీ అయిన ఉక్రెయిన్ ప్రజలు

న్యూఢిల్లీ, మార్చి 2:ఉక్రెయిన్‌లోని ప్రధాన నగరాలపై రష్యా దాడులను పెంచుతోంది. కీవ్, ఖార్కీవ్ ప్రాంతాల్లో బాంబు దాడులను తీవ్రతరం చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, టీవీ టవర్, పోలీస్ బిల్డింగ్? ఇలా పలు ప్రాంతాలపై రష్యా సేనలు బాంబు దాడులు చేస్తున్నాయి. ఈ దాడులకు దీటుగా బదులిచ్చేందుకు ఉక్రెయిన్ శతధా ప్రయత్నిస్తూనే వుంది. అయినా.. వాటి బలం సరిపోవడం లేదేమో. దీంతో స్థానికులే ఏకంగా రంగంలోకి దిగారు. రష్యాను ప్రతిఘటించడానికి పెట్రో బాంబులను వాడాలని నిర్ణయించుకున్నారు.

ఈ పెట్రో బాంబుల ద్వారా రష్యాను ఎదుర్కొంటామని, కీవ్ ప్రాంతాన్ని కాపాడుకుంటామని స్పష్టం చేస్తున్నారు. కీవ్ ప్రాంతానికి రక్షణగా తాము ఉంటామని, పెట్రో బాంబుల వాడుతూ? రష్యాకు బదులిస్తామని పేర్కొంటున్నారు. తాము యుద్ధానికి ఏమాత్రం భయపడటం లేదని, తమ మాతృభూమి కోసం తాము పోరుడుతున్నామని అంటున్నారు. తామేమీ రష్యాకు భయపడటం లేదు. మేము కూడా మంచి పోరాట యోధులమే. ఎలాంటి ఆయుధాలు కూడా లేకుండా రష్యా సేనలతో పోరాటం చేయగలం అని పేర్కొంటున్నారు.




నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com
2 హైదరాబాద్    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    గురువారం 3-3-2022

నేటి దృశ్యం

## కోటి విద్యలు...

ఆటవిడుపు చిత్రంకాదు
ఆదమరిస్తే బ్రతుకు చితి పాలు
కడుపు కార్చిచ్చును
చల్లార్చడానికి
తనువుల విన్యాసాలు
మనుగడ పరిహాసాలు.

ఎన్ని "మార్వెల్ ఆర్టులు "ప్రదర్శిస్తే మాత్రం
జీవన చిత్రంలో నిండు వెలుగులెపుడో?



-కిలపర్తి
దాలినాయుడు
7780589336








అణువుల
సంఘటనం
తనువు–
అణువు
తనువులో
పరమాణువు–
పరమాణు
గుండెల్లో
పరమశక్తి!
వినియోగించుకొంటే
మన "యుక్తి"!

-డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878



## 'కనకధార' ఆవిష్కరణ



మనిషికి డబ్బుతో సుఖం కలుగొచ్చు కానీ సంతోషం కలగాలంటే సంతృప్తి చాలా అవసరమని, 'కనకధార' పుస్తకం చదివితే మానసిక సంతృప్తి కలుగుతుందని ప్రభుత్వ సలహాదారు డా॥ కే.వీ.రమణాచారి అన్నారు.సోమవారం రమణాచారి క్యాంప్ కార్యాలయంలో నమా సుబ్రహ్మణ్య శాస్త్రి రచించిన 'కనకధార' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత కూతురు అరుణకుమారిని సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తండ్రి రచించిన పద్యాలను సేకరించి ఇరవై ఐదు ఏళ్ల తర్వాత వాటిని పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమని అన్నారు. నేటితరం పిల్లలకు ఈ సభ ఒక ఉదాహరణ అని అన్నారు. చక్కటి పద్యాలతో కనకధార పుస్తకం రూపొందడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో యువ కళావాహిని సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, డా॥ పూసల రజనీగంగాధర్, ఎస్.వీ. రఘువీర్ ప్రతాప్, అరుణకుమారి, నటుడు ఆనంద చక్రపాణి, శ్రీధర్, గుదిబండి వెంకటరెడ్డి, పెద్దూరి వెంకటదాసు పాల్గొన్నారు.

## 'సైరన్' నవల ఆవిష్కరణ



అల్లం రాజయ్య రచించిన 'సైరన్' నవల ఆవిష్కరణ సభ ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. రచయిత్రి ఓల్గా అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత పి.చంద్ హాజరై సైరన్ నవలను ఆవిష్కరించి ప్రసంగించారు. నవల సింగరేణి కార్మికుల తొలిదశ ఉద్యమ వాస్తవ పరిస్థితులను తెలియజేస్తోందని చెప్పారు. సింగరేణి బొగ్గుబావిలో పనిచేసే కార్మికులకు జీవన స్థితిగతులు అద్దం పట్టేలా రచనలు చేశారని గుర్తు చేశారు. ఏకే ప్రభాకర్ నవలను పరిచయం చేశారు. వాసిరెడ్డి నవీన్, ఖదీర్‌బాబు, మానస ఎండ్లూరి, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

**అక్షర సేద్యం ఫౌండేషన్**





దుర్గమ్ భైతి రచించిన
రామసక్కని **గాలిపటం** బాలల కథలు
**పుస్తకావిష్కరణ & బాలసాహిత్య ప్రోత్సాహకుల సన్మాన సమావేశము**
తేది : 05-03-2022 శనివారం, సా॥ 6-00 గం॥కు, వేదిక : ప్రెస్ క్లబ్, సిద్దిపేట.

| | | |
|---|---|---|
| సభాధ్యక్షులు | : | శ్రీ భైతి దుర్గయ్య గారు, అధ్యక్షులు, అక్షరసేద్యం ఫౌండేషన్ |
| ముఖ్య అతిథి | : | శ్రీమతి వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ గారు, అధ్యక్షురాలు, జిల్లా పరిషత్, సిద్దిపేట. |
| పుస్తక ఆవిష్కర్త | : | డా॥ ఏనుగు నర్సింహారెడ్డి గారు, కవి, అడిషనల్ కలెక్టర్, మేడ్చల్ జిల్లా. |
| విశిష్ట అతిథులు | : | శ్రీ యద్మ మాధవరెడ్డి గారు, కార్యదర్శి–వందేమాతరం ఫౌండేషన్<br>శ్రీ సత్తు యాదవరెడ్డి గారు మండల విద్యాధికారి, సిద్దిపేట (U)<br>శ్రీ మొసర్ల మాధవరెడ్డి గారు, అధ్యక్షులు, సుగుణ సాహితి సమితి, సిద్దిపేట. NRI |
| ఆత్మీయ అతిథులు | : | శ్రీ రాళ్ళబండి పద్మయ్య గారు GHM, ZPHS జక్కాపూర్<br>శ్రీ ఎన్నవెళ్ళి రాజమౌళి గారు, కథల తాతయ్య, సిద్దిపేట<br>శ్రీ కూకట్ల తిరుపతి గారు, కవి, రచయిత |
| పుస్తక సమీక్ష | : | శ్రీ యాడవరం చంద్రకాంత్ గారు, బాలసాహిత్య రచయిత |
| ఆహ్వానము | : | శ్రీ వేల్పుల రాజు గారు, ప్రధాన కార్యదర్శి, అక్షరసేద్యం ఫౌండేషన్ |

అందరూ ఆహ్వానితులే
ఆహ్వానించువారు :
**అక్షర సేద్యం ఫౌండేషన్ టీమ్**
దూదికట్ల నరేందర్, మ్యాన లలిత, గుజ్జ అశోక్ కుమార్,
వేల్పుల కవిత, భైతి అనిల్ కుమార్

ఘంటారావం

ద్వేషించే మనిషి
శ్మశానం
ప్రేమించే మనిషి
ప్రసూనం.

అభిమానమున్న వాళ్ళు
అభిమన్యులు
దురభిమానమున్న వాళ్ళు
దుర్యోధనులు.

మోసం చేసే నైజం
మోసపోవడం సహజం
కత్తులు దూసే పైత్యం
కత్తికి బలవడం తథ్యం.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



పుస్తక సమీక్ష



# నిఖార్సైన కవిత్వంతో...రూపుదిద్దుకున్న 'నీడల దృశ్యం'!

1995లో 'సమాంతర స్వప్నం' గ్రంథంతో సాహితీలోకానికి పరిచయమైన కవి, విమర్శకులు, అనువాదకులు డా॥ ఏనుగు నరసింహారెడ్డిగారు పదమూడో పుస్తకంగా 'నీడల దృశ్యం' కవితా సంపుటిని ప్రకటించారు.

నిఖార్సైన కవిత్వంగా... వాస్తవిక దృక్పథంతో.. ఉత్తమ వ్యక్తిత్వాన్ని జోడించి.. 'నీడల దృశ్యం' కవితా సంపుటికి జీవం పోసిన డా॥ రెడ్డిగారు వృత్తిరీత్యా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. లోగడ 2017–2019 ప్రాంతంలో తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. సమాంతర స్వప్నం, నేనే, మట్టిపాట, కొత్తపలక, మూలమలుపు, తెలంగాణ రుబాయిలు వంటి కవితా సంపుటులు ప్రకటించి... సాహితీరంగాన ఓ ప్రసిద్ధ కవిగా తమ స్థానాన్ని పదిలపరుచుకున్న రెడ్డిగారు రెవెన్యూశాఖకు సంబంధించిన వ్యవస్థపై తమ అనుభవాలను రంగరించి ఓ పరిశోధనాత్మక గ్రంథంగా.. రెవెన్యూ రంగానికి దిక్సూచిలా ఉండేవిధంగా సంస్కరణలను ప్రతిపాదించి అందరి మన్ననలు పొందారు.

తెలంగాణ... విరంచి జాతీయోద్యమగీతాలు ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టిన విమర్శ గ్రంథం... హైదరాబాద్ విషాదం, అసఫ్‌జాహీ సంస్థానం విలీనగాథ అనువాద గ్రంథాలు ఆయనను అనువాదకునిగా నిలిపాయి... ముఖ్యంగా రుబాయీలు అంటే డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారి తెలంగాణ రుబాయిలే అన్నవిధంగా కవితాత్మకంగా, రుబాయీలను ప్రకటించిన ఘనత ఆయనకు ఉంది.

ఇప్పుడు వెలువరించిన 'నీడల దృశ్యం' కవితాసంపుటి నిండా నిఖార్సైన కవిత్వం ఉంది. ఆయన నిబద్ధత, నిష్కల్మష హృదయం అడుగడుగునా కానవస్తుంది. వస్తు ఎంపికలో వైవిధ్యముంది. అభివ్యక్తిలో నవ్యతను పాటించారు. సామాజిక చింతనంతో ఆయన ఉత్తమ సంస్కారాన్ని జతపరిచి పదబంధ ప్రయోగంలో ఔచిత్యాన్ని పాటిస్తూ.. కవిత్వం రాయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నట్లు ఇందలి రచనను కొనసాగించారు.

మనసుల్ని మెలిపెట్టగలిగే మృదువైన కావ్యమొకటి రాయగలిగితే భూగోళంలో కొంతభాగం జయించినట్లే ఉంటది కవికి అంటూ "వెర్రి" కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. కవితోపాటు ఈ కవితలో చిత్రకారుడు, శిల్పి గురించి ప్రస్తావించిన తీరు బాగుంది. చివరలో.. మహాసామ్రాజ్యాలిక్కడ కొలువై వుంటే.. మలిన సింహాసనాల వెంట వెర్రిలోకం అని ముగించడంలో కవియొక్క ఔచిత్యాన్ని గ్రహించగలం..

వడగాల్పుల నెదుర్కొంటున్న కవిత్వంతోటలో వాడిపోని పూలేమైనా ఉన్నాయేమో నని వెతుక్కుంటూ–కొత్త కవుల అంతరంగపు చేదబావిలో మలినంకాని మంచినీళ్ళను చేదుకుంటూ సమావేశపు నీలాకాశంలోపల ఎన్నడైనా ఒకటీ అరా మెరుపు మెరవడం చూసి మురుస్తుంటానని "వాడిపోని పూలకోసం" కవితలో ప్రకటించిన తీరు ప్రశంసనీయంగా ఉంది. సభలకు అంతంత సమయం ఎందుకు పెడతావంటే.. ఏం చెప్పను! సాక్షాత్తు మాతృభాషలో సరళ వ్యవహారపు సద్గ్రంథం చదువుకున్నానని ఎలా చెప్పను..! అని వ్యక్తీకరించడంలో కవికి మాతృభాష పట్ల సాహిత్యంపట్ల ఉన్న మక్కువను ఇట్టే అర్థం చేసుకోవచ్చు.. ఓ కవిగా తాను పొందే అనుభూతులను చక్కగా ఆవిష్కరించారు.

'కొత్త బంగారులోకం' కవిత ఆసక్తికరంగా మలచబడింది. అలతి అలతి పదాలతో అద్భుతమైన భావాలకు చోటు కల్పించారు.

కల పడుతున్నదా.. కల పండుతున్నదా.. ముందే రాయబడ్డ రూపకానికి ప్రదర్శన సిద్ధమవుతున్నదా.. ముహూర్తపు తీగమీద తొలి అంకపు నర్తనకు గడియ ఎదురొస్తున్నదా.. అంటూ కవితను






ప్రారంభించడం బాగుంది. కవి పైకి పెళ్ళి గురించి దృశ్యమానం చేసినప్పటికీ.. విభిన్న కోణాల్లో విశ్లేషించుకోవడానికి రాయబడిన కవిత ఇది! ఉన్నలోకం నుండి కొత్తలోకానికి బదిలీ అయినట్లు ఉన్న ప్రదేశంలోనే ఉన్నత ప్రదేశం పెళ్ళి...తిరిగిన నేలమీదే తరగని స్మృతుల ద్వీపం పెళ్ళి అంటూ పెళ్ళికి కొత్త నిర్వచనాలను యివ్వడంలో కవి సఫలీకృతులైనారు. రెండు చేతులు కలిసుంటాయొకచోట.. వేళ్ళు మారే ఉంగరాలు ఒకచోట దండలు పూలతోపాటు హృదయాలను మారుస్తాయి.. ఏడడుగుల్లో నూరేళ్లే పొదుగుతాయని ముగించడం బాగుంది.

"తరంగాలు" కవితలో కూతుళ్లను ఉన్నతంగా చిత్రించారు. కొడుకులు వారసులైతే కావచ్చుకానీ.. కూతుర్లు తండ్రుల అంతరంగ తరంగాలు అంటూ కూతుళ్లపై కవికి ఉన్న మక్కువను అంతరంగ తరంగాలుగా అభివర్ణించారు.

''నీడల దృశ్యం'' కవితను ఆలోచనాత్మకంగా కవితాత్మకంగా తీర్చిదిద్దారు.

ఈ కవితలో కవి తాను చిన్ననాడే కోల్పోయిన నాన్నను గురించి ఆర్ద్రమైన భావాలకు చోటు కల్పించారు. నా గొడుగునెవ్వడో కాలం గాలి తిరిగేసుకుపోయింది.. నా కవచ కుండలాలనెవరో నాకు తెలియకుండానే దానం తీసుకున్నారు.. మోట దారుల్లో మోకు తెగి నా కాలం వెనక్కి నడిచింది.. అంటూ నాన్నతో అనుబంధాన్ని పొందలేక.. మనసుపడే వేదనను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. నడవడానికి ఏ పిల్ల తొవ్వా వరుచుకోక ముందే.. ఆడివిుల పొద్దుగూకిందంటూ వాపోయారు. అందం తప్పిన ఆకాశంలో ఉరకక తప్పని పక్షిగుంపులో ఒక పిట్ట ఉన్నట్టుండే. తెగిపోయిన గాలిపటంలా వేళ్ళు పట్టమంటున్నా పిట్ట రంగేదీ దొరకలేదని.. పిట్టగా తోడబుట్టిన అతనిని తలుచుకుంటూ.. పిట్ట గురించి తమ మనసులో కదలాడే భావాలను మనతో పంచుకున్నారు. ఆ పిట్ట అర్థాంతరంగా అంతర్థానం కాకుంటే ఎన్ని సుద్దులు వినిపించేదో అని వాపోయారు. పిట్టతో జ్ఞాపకాలే లేవుకాని... మనిషితనం చాలించాకే కదా! నాయిన పిట్టయి నావెంట తిరుగుతున్నది అంటూ ముగించడం బాగుంది.

నాన్నలేని లోటు ఎవరూ భర్తీ చేయలేరన్న అర్థం ధ్వనించే విధంగా ఈ కవితకు రూపమిచ్చారు.

నువ్వొక జాట్‌వు కాదు.. నువ్వు ఒక మనిషివి కాదు.. సత్యం ఆలోచించి.. సత్యమే పరమావధిగా..సత్యమే ఆచరించే.. సగటు రైతన్నవు నీవు.. నీకంట పొంగిన కన్నీటి ఉప్పెన ఢిల్లీ కుట్రల్ని ఊడ్చేసి..ఘాజీపూర్ పేరు దక్షిణోత్తరాలకు విస్తరించేలా దుఃఖజల ఆయుధమైందంటూ రైతు నేత రాకేష్ తికాయత్‌ను కొనియాడుతూ "కన్నీటి మంట" కవితను ఈ గ్రంథంలో పొందుపరిచారు. నల్లచట్టాల మీద ఊరేగుతున్న ఆర్యగణాన్ని నలుపు తెలుపుల నడుమ నిలబెట్టనుంది... కాకలు తీరిన పార్టీలు చేయని పని అశ్రు బిందువుతో చేశావు.. అందుకో మనసంతా అక్షరాలు చేసి సమర్పిస్తున్న తెలుగు కవి వందనాన్ని అంటూ రాఖేష్ తికాయత్ పట్ల డా॥ రెడ్డిగారు తమ గౌరవాన్ని చాటుకున్నారు.

పిల్లలు నవ్వినప్పుడే కొన్నిపూలు ఏరుకుంటానంటూ 'అపురూపం' కవితను ప్రారంభించారు. అనుకున్నవేవీ దొరకవని.. దొరికినవన్నీ కోరుకున్నట్లే ఉండవని.. అందిన జ్ఞాపకాలన్నీ అపురూపంగా మూటగట్టుకుంటానని చెప్పడం బాగుంది.

'లాంగ్ జంప్' కవితలో కవి ఆశావహ దృక్పథాన్ని ప్రదర్శించారు. కాలాలు మారినా నిలబడాలని.. వక్షాలు వాదాలు మార్చుకున్నా ఎదురీదాలి.. కొండ ఎదురైన చోట ఈదడం తప్పు.. ఊపిరి బిగబట్టుకుని కదా లాంగ్‌జంప్ చేయాలని హితవు పలికారు.

'సంసిద్ధం' కవితలో జీవించడమంటే మరేమి కాదు... రేపటి ప్రమాదానికి సిద్ధం కావడమేనని తెల్చి చెప్పారు. ఏ పాదానికి ముల్లు నాటితే ఎట్లా తీసుకోవాలో తెలుసుకోవాలని.. ఎప్పుడూ తోడుండేవాళు ఎప్పటికీ ఉండని వాళ్లేనని.. ప్రశాంత చిత్తంతో పాఠాలు చదువుకోవాలని సూచించారు. ఏ దారుల్లో గుంతలో జారిపడితే ఎట్లా ఒడుపు చెయ్యాలో ఎరుక బట్టాలని.. అన్నమాటకూ విన్నమాటకూ నడుమ అంతరం దీర్ఘతను అంచనా వేయాలని ఓ గొప్ప సందేశాన్నిచ్చారు.

"పెద్ద ఒడి" కవితలో కవి ప్రకటించిన భావాలు ప్రశంసనీయంగా ఉన్నాయి. చుక్కలను సిగలో చెక్కిన శిల్పం చందమామను 'అరా' చేసుకొని ప్రభాతాలకు సంధ్యాశోభ తెచ్చిన ఒక దేవకన్య భువికి దిగి పితృభూమికి మురిసి శాశ్వతంగా నిలబడిపోయింది అంటూ రాసిన పంక్తులు కవితలో చక్కగా ఒదిగిపోయాయి.. రాయిలో వురుడు పోసుకున్న శిల్పమనుకుంటాం.. కానీ ఆమె శిలలో పొదిగిన పరిణతాత్మ అంటూ చక్కని ముగింపునిచ్చారు.

అన్నిసార్లూ కష్టాలే మనల్ని కుంగదీస్తాయని చెప్పలేం.. 'దేవతలు గూడా' సమయా నుసారంగా మనల్ని ఏడిపించగలుగుతారని మరో కవిత ద్వారా తెలియజెప్పారు.

'ఊట' కవితలో కవిత్వపు ఊటను యాతమెత్తి తోడేవాడు.. కన్నీటి ధారల శోధనపుటడవుల్లో చిక్కిపోయినవాడు.. రాతగాళ్ళకు దిక్సూచి వంటివాడని.. బుద్ధి జీవులకు శుద్ధవాక్యం అంటూ కవి కె.శివారెడ్డి గారి పట్ల కవి తమ గౌరవాన్ని చాటుకున్నారు.

'నిజదర్పణం' కవితలో సమతల దర్పణమే అయితీరాలని నిబంధనలు లేవని.. మనం పట్టించుకోంగానీ మనచుట్టూ తిరుగుతున్నదంతా మనకొక నిజదర్పణమే అంటూ వ్యాఖ్యానించారు. ఇలా ఎన్నో కవితా పంక్తులు ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. చాలా కవితల్లో లోతైన భావాలకు చోటు కల్పించడం ప్రశంసనీయం.

కవితలకు శీర్షికలు పెట్టడంలోనూ కవి తమ నేర్పరితనాన్ని ప్రదర్శించారు. పాలనారంగంలో.. సాహితీరంగంలో నిబద్ధతతో చేస్తున్న ఆయన కృషిని అభినందిద్దాం.

పేజీలు..128:వెల రూ100
ప్రతులకు: ఏనుగు నరసింహారెడ్డి
3-14-50విజయశ్రీ కాలనీ
సహారా రోడ్, వనస్థలిపురం
హైదరాబాద్–70
8978869183



- దాస్యం సేనాధిపతి
9440525544

# "అక్షరం అమృతం" వ్యాస సంపుటి ఆవిష్కరణ

అక్షరం అమృతం వ్యాస సంపుటి లోని ప్రతీ వ్యాసం నేటి సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని పలువురు వక్తలు అన్నారు. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి కళా సుబ్బారావు కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త పొత్తూరి సుబ్బారావు రచించిన అక్షరం అమృతం వ్యాస సంపుటి ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి. రమణాచారి అక్షరం అమృతం వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ ఈ సంపుటిలోని ప్రతి వ్యాసం ఎంతో విలువైనదన్నారు. ఈ సంపుటిలోని వ్యాసాలు చదువుతుంటే మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. సుబ్బారావు కవిగానే కాక వ్యాసకర్తగా విశ్లేషణాత్మక వ్యాసాలు పలు అంశాలపై సృజించాలని అభినందించారు. సంపుటిలో ఎనిమిది అంశాలపై మొత్తం 58 వ్యాసాలున్నాయని, అన్నీ రెండు పుటలు దాటకుండా క్లుప్త




ఫిబ్రవరి 26న త్యాగరాయ గానసభలో పొత్తూరి సుబ్బారావు రచించిన "అక్షరం అమృతం" వ్యాస సంపుటి ఆవిష్కరణ సభలో శ్రీమతి సుబ్బాయమ్మ, సమాచార శాఖ పూర్వ డైరెక్టర్ సుభాష్‌గౌడ్,తంగిరాల చక్రవర్తి, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, ఆవిష్కర్త ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారి, పొత్తూరి సుబ్బారావు, రమణ వెలమకన్ని, పెద్దూరి వెంకటదాసు, వి.వి.రాఘవరెడ్డి




"అక్షరం అమృతం" వ్యాస సంపుటి ఆవిష్కరణలో రచయిత పొత్తూరి సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న శ్రీమతి సుబ్బాయమ్మ, సమాచార శాఖ పూర్వ డైరెక్టర్ సుభాష్‌రెడ్డి, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, తంగిరాల చక్రవర్తి, రమణ వెలమకన్ని, తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారి

సుందరగా ఉన్నాయని వివరించారు. నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. వివిధ పత్రికల్లో సుబ్బారావు గతంలో రాసిన వ్యాసాలతో అక్షరామృతాన్ని అందించారని అభివర్ణించారు. జ్ఞానానికి అక్షరం సాధనమని, అది అమృత తుల్యమని వివరించారు. సాహితీవేత్తలు రమణ వెలమకన్ని, తంగిరాల చక్రవర్తిలు సుబ్బారావు వచన శైలిని విశిష్టతను ప్రశంసించారు. వేదికపై సుబ్బారావు తన సంపుటిని సుబ్బాయమ్మకు అంకితమిచ్చారు. గుదిబండి వెంకటరెడ్డి స్వాగతం పలికిన కార్యక్రమానికి తొలుత పెద్దూరి వెంకట దాస్ నిర్వహణలో కవి సమ్మేళనం జరిగింది.

## నేడు

బండ రాళ్ళపై
కొండ కొనలపై
చెట్టు మొదళ్ళపై
గట్టు అంచులపై

బస్సు సీట్లపై
గ్లాసు బాటిళ్ళపై
భవన శిఖరాలపై
ప్రహరీ గోడలపై

పార్కు బెంచీలపై
కాలేజీ డెస్కులపై
శిథిల శకలాలపై
చారిత్రక కట్టడాలపై

బట్టల నేతల్లో!
ఎంబ్రాయిడరీ కుట్లల్లో
రైలు పెట్టెల్లో
అల్చిప్పల్లో

పచ్చ బొట్లల్లో
పుష్కర రేవుల్లో
దుప్పట్ల ప్రింట్లలో
గిఫ్ట్ ప్యాకెట్లలో

ముఖ పుస్తకాల్లో
వాట్సాప్ సందేశాల్లో
వెండి బంగారు హారాల్లో
జంటలు చేసే విహారాల్లో

ఎటు చూస్తే అటు
ఎక్కడంటే అక్కడ
కుప్పలుగా తెప్పలుగా
కనిపిస్తుంది 'ప్రేమ..' నేడు

అది ఉండాల్సిన
మనిషి మనసులో తప్పు!

- ఎస్. కాశింబి
సెల్: 9052216044



పుస్తక సమీక్ష

# బాల సాహిత్య శోధన,సృజన

నాటి కరీంనగర్ జిల్లాను 'కవులగడ్డ'గా పేర్కొనటంలో అతిశయోక్తి లేదు. విశేషించి, వేములవాడ, ధర్మపురి క్షేత్రాలలో విద్వత్తు వర్ధిల్లింది. తొలి కంద పద్యం, ఆవిర్భవించిన ప్రాంతంగా, ఆధునిక మహాకవి డా॥సి. నారాయణరెడ్డి జన్మస్థలంగా వేములవాడ కొనియాడబడితే, 1800 ప్రాంతంలో కామస్థం శేషప్ప కవి భూషణ వికాస/ శ్రీధర్మపురి నివాసా/ దుష్ట సంహా నరసింహ/ దురిత దూర/ మకుటంతో నరసింహ శతకం రచించిన వాడుగా వినుతి కెక్కాడు. వర్తమానంలో సంగనభట్టవారు సాహితీ సేవలో గణుతికెక్కారు. సంగనభట్ట చిన్న రామకిష్టయ్య వృత్తిరిత్యా అధ్యాపకులు ప్రవృత్తిరిత్యా కవి, రచయిత, గాయకుడు. బాల సాహితీవేత్తగా వీరు సుమారు 500 బాలకథలు వ్రాసారు. ఆకాశవాణి కళాకారుడు. చందమామ, బాల మిత్ర, బుజ్జాయి, బాలబాట, చంద్రబాల లాంటి పిల్లలకుద్దేశించిన పత్రికలే కాకుండా 'ప్రజాశక్తి, వార్త,ఈనాడు, మన తెలంగాణ వంటి ప్రముఖ దినపత్రికలలో వీరు తమ సత్తా చాటుకున్నారు.బాల సాహిత్య పురస్కార గ్రహీత డా॥పత్తిపాక మోహన్‌గారి మాటల్లో.. "ఒక యజ్ఞంలా ఆయన రాస్తున్న కథలు ప్రతిరోజు ఏదో






పత్రికలో అచ్చుకావటం చూడవచ్చు. అది బాలల పట్ల బాలలసాహిత్యం పట్ల ఆయన (రచయిత) కున్న ప్రేమ, నిబద్ధతకు నిదర్శనం".

1990 నుండి రాస్తోన్న చిన్న రామకిష్టయ్య 2001 నుండి బాలసాహిత్యంవేపు దృష్టి మరలించారు. ఉపాధ్యాయ వృత్తి వీరి ప్రవృత్తికి బాగా సహకరించి ఒదని చెప్పవచ్చును. 'రంగినేని ట్రస్ట్', 'పెందోట' వంటి సంస్థలు వీరికి పురస్కార ప్రదానం చేసి తమ గౌరవాన్ని చాటుకున్నాయి.

బాలల కథా సంపుటి "చేప నవ్వింది"లో 40 చిన్న కథలున్నాయి. రాజులు, రాజ్యాలు, జంతువులు. వక్షులు పండితులు, పామరులు, చెట్టు చేమలు– అన్నింటిని తన కథా పాత్రలుగా మలిచినారు. స్నేహం, గురుదక్షిణ, కీర్తి, ఓర్పు, నిజాయితీ, త్యాగం, పరిశుభ్రత, గొప్పతనం, పిరికిగుణంలాంటి వైవిధ్యభరితమైన గుణాలు ఈ సంపుటిలో జీవం పోసుకున్నాయి.

పెద్దలతో పోలిస్తే, పిల్లల ప్రపంచం చిన్నది. కనుక రచయిత చిన రామకిష్టయ్య ఎంచుకున్న కథ, కథానేపథ్యం, మౌలిక ఇతివృత్తం– ఇవన్నీ, బాలల ఊహాపరిధిలోకి వచ్చినవే కావటం గమనార్హం.

పాయసపానంలో కిస్‌మిస్, బాదాం పప్పులు రుచిని ఇనుమడించిన విధంగా, ప్రతి కథలోని అంతర్లీన సందేశం, ఒక్కోచోట ముగింపుగా నీతివాక్యాలు, చదివే బాలల మనస్సుల్లో గాఢమైన ముద్రవేసి వారిని ఆలోచింప చేయటమే కాకుండా, వాళ్ళ చిన్ని బుర్రల్లో తర్కానికి ఆస్కారం కలిగిస్తాయీ కథలు.

దానం చేసిన కొద్దీ డబ్బు తరగదు. ఇంకా ఎక్కువవుతుంది (పే.1) వ్యతిరేకత అన్నది ప్రకృతి గురించో జంతువుల గురించో తమాషాకు ఉండాలి తప్ప మనుషుల పట్ల ఉండకూడదు (పే.15). మానవ సేవే మాధవసేవ (పే.36) తొందరపాటు కూడదు (తొందరపాటు కథ), ఏ శిష్యుడికైనా ప్రశ్నించే తత్త్వం ఉండాలి. తెలుసుకోవాలన్న ఆసక్తి ఉండాలి (పే.46). అడవులను పెంచితేనే వర్షాలు కురవటమే కాకుండా, జంతువులకు ఆశ్రయం కల్పించిన వారమవుతాము (పే.51)లాంటి గొప్ప నీతి అంశాలు పిల్లలను ఆలోచింపచేస్తాయి.వారిలో తార్కికతను పెంచి, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దటానికి ఎంతగానో సాయపడతాయి.

రచయిత సంగనభట్ల చిన రామకిష్టయ్య వ్రాసిన పలు కతలు వివిధ పోటీల్లో పురస్కారాలు అందుకున్నాయి.

అక్షరంకన్నా ముందు పుట్టిందికథ. సాహిత్యం ఊహాశక్తిని పెంచుతుంది. రాజుల కాలం నుండి నేటికాలం వరకు బాధ్యతగా మసులుకోకపోతే, ఎట్టి విపరీత పర్యావరణ ప్రమాఆలను ఎదుర్కొవాల్సి వస్తుందో వివరించే ఈ కథలు నాలుగు కాలాలపాటు నిలుస్తాయి. అలిరిస్తాయి. రచయితకు అభినందనలు.

**ప్రతులకు:** సంగనభట్ల చిన్న రామకృష్ణ,
ఇ.నెం. 11-52, గోదావరి రోడ్
ధర్మపురం–505 425
జగిత్యాల జిల్లా
సెల్: 9908554535

- కూర చిదంబరం
సెల్: 8639335675



## ఘోష

ఆకలి చావుల ప్రపంచంలో
ఇప్పుడు మరో
మరణమృదంగం తాండవమాడుతోంది
మనిషికి మతం ఉన్మాదమిస్తే
దేశాలది విస్తరణ కాంక్ష
శకలాలు శకలాలుగా రాలిపోతూ
భవనాలు, కుటుంబాలు !
ప్రపంచం కుగ్రామమయిందంటాం కానీ
ప్రపంచం మళ్ళీ కుంగిపోతోంది
ఉత్తర దక్షిణ ధ్రువాలుగా !
విశ్వ రహస్యాలను ఛేదించే మనిషి
విస్తరణ కాంక్ష అనే
అయస్కాంతానికి దేశాలతుక్కుపోతుంటే
నివారించలేని అచేతనుడయ్యాడు !
రణం మొదలవటానికి కారణమక్కర్లేదు
సాకు మాత్రమే చాలని
చరిత్ర చెబుతూనే ఉంటుంది !
కాలం కరుకైనదంటాం
కాదు
దేశాలమధ్య రగిలే కాంక్షలు కరాళనృత్యమై
ఉషోదయాల ఉసురుతీసి
అనిశ్చితి ఊబిలో నెట్టేస్తాయి !
నిట్టూర్చే గొంతులనూ
నొక్కేసే నెగళ్ళు రాజుకుంటుంటే
రెక్కలు తెగిన శాంతికపోతాల రుధిరం
నిస్సహాయతకు సంకేతమై
జాలిగా ఘోషిస్తుంటుంది !

-సి.యస్.రాంబాబు
8374818961





## ఆగుతుందా అగ్నిహోత్రం

చేతనైతే రా... చెడుగుడు ఆడతా అంటూ,
సవాల్ విసిరిన సామ్రాజ్యవాదం...
అగ్రరాజ్యం అండ ఉంటుందనుకొని,
ఉగ్రరూపం చూపుదామనుకున్న ఉక్రెయిన్...
పక్కదేశపు పాత పగల పుతిన్,
పట్టపగలే చుక్కలు చూపిస్తుంటే...
పులినోట్లో తలపెట్టిన మేకపిల్లలా,
దిక్కు తోచక బిక్కుబిక్కు మంటుంది...
నా బలమంతా నాటో దేశాలనుకుంటే,
నోటి మాటలన్నీ నీటి మూటలైనయ్...
ఐక్యరాజ్య సమితి ఏకమైతదనుకుంటే,
ఐక్యత లేని సమితిగా మిగిలిపోయింది...
జనానికిష్టంలేని దేశాల మధ్య యుద్ధం,
జనావాసాల మీద కురుస్తుంది
బాంబుల వర్షం...
ఎవరి ప్రయోజనాలు వారికే ముఖ్యమైతే.,
శాంతి మంత్రాలతో
ఆగుతుందా అగ్నిహోత్రం.!?



-పెసరు లింగారెడ్డి
9010292500

## యుద్ధమో విషాదగీతం

యుద్ధమంటే వినాశనమే
విన్యాస్యాలతో ప్రాణనష్టమే
ఆ నష్టమంతా ఏమెరుగని సామాన్యలదే
ఊపిరంతా బూడిదైపోతోంది
పుడమంతా రక్తసిక్తమై దిక్కులేనిదై దీనంగా
మనవత్వం మరచిన
మనిషి సృష్టించే మారణహోమంలో
తనలోని శక్తినంతా కోల్పోయి
దగాకోరు సమాజంలో
మోడుబారుతనాన్ని అలంకరించుకున్న
శిలై తల్లడిల్లుతోంది.

ఎన్ని గుండెలు అల్లాడుతున్నాయో
మేధస్సెంత మెదడునింపుకుంటేమి?
నరాలుచిట్లి మనిషిని శవాలుగాజేసి
మట్టినిసైతం మాయంజేసుందుకే
ఆధిపత్యాహంకారధోరణితో
ఎన్నో శిఖరాలనదిరోహిస్తూ
ఉన్నతంగా ఎదిగిన
సూర్యుడిశక్తికి మాడిమసయ్
ఆనవాలులేని మనిషితనమే
నిర్మించడమెంతకష్టమో
తగలెట్టినట్లైతే కాదుగా.

యుద్ధం నేర్పేదేమి
కరుకుగుండెలన్నొక్కటై
కసిగా కసికసిగా దొంగలా
మనిషిని తునాతునకల్జేయడమే
మాంసం ముద్దలన్ని ఘోషిస్తుంటే
రాక్షసగీతమాలపించడమే
అంతయ్యాక
దయ్యాలు వేదాల్జెప్పిన్నట్టు
ఆధిపత్యగీతమాలపిస్తరు
శవాల లెక్కలు చరిత్రలో లిఖిస్తారు

అణువంతైన బయమేలేదే
అణుబాంబులంటే
ఆటలాడుకుంటున్నరు
కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్న
నేటి నాటుమనిషి
అమ్మలాంటి అవనినంతా
అతలాకుతలంజేస్తూ
నాశనంవైపడుగులేస్తున్నడు.

యుద్ధమంటే
అక్కడ శాంతి చిహ్నాలన్నీ
మంటలలో తగలబడుతూ
బూడిదలా మారడమేనేమో.

క్షితిమంటల్లో
నరకాన్ని ప్రత్యక్షంగా చూస్తూ
మరణాన్ని రుచిచూడడమే
ఎంజరుగుతుందో తెలియని
అయేమయంలో తనువును వదిలేయడమే.

శాస్త్రవేత్తలు సాధించిన విజ్ఞానం
నేడు వినాశనానికి నాందైంది
సాంకేతికత నాగరికతకు
సమాధికడుతూ
ప్రకృతినంతా
కృత్రిమత్వంతో అలంకరిస్తున్నరు.

తిరుగుతున్న నేలనంతా అణుబాంబులతో
అలుకుతున్నరు
గ్యారంటీ మాటేమోగాని
వారంటీలేని జీవితాలు
కాలుష్యభూతమొకవైపు
చాపకిందనీరై చావుమేళం మోగిస్తోంది

బెదిరించడమాని
బ్రతికించడం మదినింపుకో
కూల్చడమాని
నిర్మించడం నేర్చుకో
యుద్ధమెపుడు భయానకస్వప్నం
శాంతికోసం అడుగులేద్దాం
విశ్వశాంతితోనే మనిషికి మనుగడ



-సి. శేఖర్(సియస్సార్),
9010480557

## యుద్ధం

మార్పు రాదా
రెండు ప్రపంచ యుద్ధాలు
చూసినం ఫలితం శూన్యం
ప్రపంచం మొత్తం
యుద్ధ భీతితో తల్లడిల్లే
అగ్రరాజ్యాల నీతి పాతరేసి
ఐక్యరాజ్య సమితి నియమాలు
తుంగలో తొక్కి
అధిపత్యపోరులో
అధికారం పరమవాది అయ్యి
ప్రచ్ఛన్న యుద్ధ సాంకేతలు
ఉత్పన్నం అయ్యి
మూడో ప్రపంచ యుద్ధంకు
దార్లు పర్చిరి
ఏవి మూడో ప్రపంచకూటమి
కళ్ళు తెరవండి
ప్రపంచంపై అమెరికాకు
ప్రేమ కాదు
ఆఫ్ఘన్‌ను వదిలేసింది
ఉక్రెయిన్‌ను వదిలేస్తుంది
వారి ఆధిపత్యం కోసం
ధరలు పెరిగి
యుద్ధ భీతితో
ఆంక్షల పేరుతో
దిగుమతి
ఎగుమతి
పో గెట్టే ధరలు
మొదట అగ్రాజ్యాలు
కబంధ హస్తాలు తొలిగిపోవాలి
మూడవ ప్రపంచరాజ్యాల కూటమి
వ్యక్తిత్వ వైరుధ్యాలు
వదలి ప్రపంచం కుగ్రామం
ఎదుగుతున్న ఈ రోజుల్లో
ఒక్కసారి స్వార్థం వీడి
శాంతికై చేతల్లో చూపాలి

-వి.శేషారావు
9440408080



## పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం...!

రష్యా ఉక్రెయిన్...దురాక్రమణ
ఉడుతపిల్ల వంటి ఉక్రెయిన్ పై
పులిలా విరుచుకుపడ్డ పుతిన్
పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం విసిరినట్టే

ఉక్రెయిన్ దేశ రాజధాని కీవ్స్ పై
విరుచుకుపడి బాంబుల వర్షం
కురిపించి 300 వందలమంది
సైనికుల్ని సామాన్య జనాల్ని
పొట్టపెట్టుకున్న రష్యా రాక్షససైన్యం.

రష్యా సేనలు విసిరిన బాంబులకు
పౌరుల ప్రాణాలెన్నో గాలిలో దీపాలాయే
గర్జించిన రష్యా యుద్ధవిమానాలు
గగనతలాన్ని మూసివేసి ఐదు
రష్యా యుద్ధవిమానాలను
కూల్చివేసిన ఉక్రెయిన్ సైనిక దళాలు.

ఉక్రెయిన్ పై ఉక్కుపాదం మోపిన రష్యా
ఉక్కిరిబిక్కిరౌతున్న పౌరులు సైనికులు
ఉగ్రరూపం దాల్చిన అగ్రరాజ్యం
కఠినమైన ఆర్థిక ఆంక్షల్ని విధించింది
రష్యా బ్యాంకు ఆస్తుల్ని జప్తు చేసింది
ఆందోళనలో ఐరోపా ఐక్యరాజ్యసమితి
అమాయకులైన ఉక్రెయిన్ ప్రజల ప్రాణాలకు
ఏరులై పారే రక్తపాతానికి రష్యాదే
పూర్తి బాధ్యతంటూ తక్షణమే సేనలను
ఉపసంహరించుకోవాలంటూ
అగ్రరాజ్యం అధ్యక్షుడు జోబైడెన్ హెచ్చరికలు

ఇది రాజ్యకాంక్షతో రగిలిపోతున్న
రష్యా రాబందు పుతిన్
ప్రపంచదేశాలకు పెట్టిన ఆరనినిప్పు
కళ్ళముందరే ఉంది మూడో ముప్పు
ఖర్మకాలి మూడవ ప్రపంచ యుద్ధమే వస్తే
అణుబాంబులతో
భూమండలమంతా బుగ్గిపాలే
అందుకే వద్దువద్దు యుద్ధంవద్దు
శాంతిచర్చలే ముద్దు ముద్దు

-పోలయ్య కవి
కూకట్లపల్లి
9110784502

## వికలమై.. శకలమై.. శిథిలమై..!

పిచ్చుకపై బ్రహ్మాస్త్ర ప్రయోగాలు
జింకపై క్రూర సింహం దాడులు
విధ్వంస క్షిపణుల కుంభవర్షాలు
ఉక్రెయిన్‌పై రష్యా దాష్టికాలు
యుద్ధోన్మాది పుతిన్ దుశ్చేష్టలు
చావు తెలివిగల గూఢచార్యాలు
హిట్లర్ వారసుడిగా అవతారాలు
అఖండ రష్యా సాకార యత్నాలు !

వికలమై, శకలమై, శిథిలమై..
భగభగలు, భుగభుగలతో..
ఆకాశ హర్మ్యాలపై దాడులు
నెత్తురోడుతున్న నరావాసాలు
వెక్కి వెక్కి ఏడుస్తున్న ధీనులు
భీతిల్లి కేకలేస్తున్న చిన్నారులు
నేలకూలుతున్న ఆశల సౌధాలు
ప్రాణాల కోసమే వలసల పరుగులు !

వీధుల్లో యుద్ధటాంకుల కవాతులు
స్విఫ్ట్ ఆంక్షల కత్తులను చూపి..
ఆర్థిక చట్రంలో బంధించి..
రష్యా దూకుడుకు కళ్లెం వేసి...
బుద్ధి చెప్పాలనే నాటో నాటకాలు
పుతిన్ చేతుల్లో అణ్వాయుధాలు
వ్లాదమిర్ పిచ్చోడి చేతులో రాళ్లు
మూడవ ప్రపంచ యుద్ధ భేరీలు
రేపటి మారణహోమ సంకేతాలు !

అగ్రరాజ్యాల మధ్య నలిగిపోతున్న..
పసికూన ఉక్రెయిన్ ఊపిరులు
కూడు చెదిరి గుండెలదిరి...
బంకర్లలో తలదాచుకునే తంటాలు
ఉక్కిరిబిక్కిరవుతున్న బాధితులు
సరిహద్దులు దాటుతున్న వలసలు
హోరాహోరీ పోరుకే జెలెన్స్కీ అడుగులు !

భూతల గగన మోతలకు సెలవిచ్చి..
యుద్ధజ్వాల్ని పలుచ పరిచి..
చర్చల తలుపులు బారుగా తెరిచి..
పుతిన్ అణు బూచిని ఆపమని...
ఉక్రెయిన్ ఊపిరికి ఆక్సిజన్ అందించి..
తీవ్ర మనో దేహ గాయాలకు లేవనాలద్ది...
యుద్ధక్షేత్రంలో శాంతి మొ?క్కలు నాటి..
విశ్వ వేదికపై శాంతి కపోతాల్ని ఎగిరేద్దాం !



-మధుపాలీ
9949700037



## యుద్ధం చీకటి ఆవిష్కరణ !

భూమి ఆగకుండా తిరిగినట్లు
పగబారినట్లు పగలు రాత్రి యుద్ధమే!
అగ్ర రాజ్యాలకు చిన్న దేశాలను చూస్తే
చంకనెత్తుకు పోవాలని
నెత్తురు నెత్తురుగా రాజ్యకాంక్ష.

యుద్ధం చీకటి ఆవిష్కరణ
నాగరికత అడవి ప్రవాసం
చంటి పాపల మనసు పై శాశ్వత భయం ముద్ర
ప్రాణ భయంతో పరుగులు ఏ దిక్కుకు ?

సంపన్న దేశాలు ప్రజా ధనాన్ని
ఎంత గొప్పగా వినియోగం చేస్తాయో ! ?
గోదాముల నిండారా కిక్కిరిసిన బాంబులు
మైదానాల్లో క్షిపణి కోరల యుద్ధ విమానాలు.

ఇంకా రేపు ఆహారం గిడ్డంగులలో అణు బాంబులే
మళ్లీ దున్నే వారు ఎవరు
పంట భూమి ఎక్కడ
స్మశాన యోగ్యమైనదే ఇక నేల

ఏ దేశ ప్రజలైనా యుద్ధాన్ని అభిమానించరు
ఏమైనా వంద పండగల ఆనందమా!
ఆయుధ రహిత నిరసన యుద్ధం ప్రకటిస్తారు
శాంతికే జయమాల వేస్తారు



- కందాళై రాఘవాచార్య
8790593638



## యుద్ధ సమాప్తికి పరితపిస్తూ..

మనసుల్లో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి
రెక్కలు చాచి ఆకాశవిహారం చేస్తున్న
లోహవిహంగాలు
కనుపాపల్లో కదలాడుతూ కలవరం సృష్టిస్తున్నాయి
ఏ క్షణం ఏ వైపు నుంచి
మానవ జనిత పిడుగు పడి
శరీరాన్ని ఛిద్రం చేస్తుందో,
ప్రాణం హరిస్తుందో అని
చిన్నాపెద్దా భీతావహులవుతున్నారు
నిన్నటిదాకా అమ్మ ఒడిలో
వెచ్చగా ఒత్తిగిల్లిన పసితనం
నడిరోడ్డున ఏడుస్తూ పరుగులెడుతోంది
ఎక్కడంటే అక్కడ స్వేచ్ఛగా సంచరించిన దేహాలు
సైరన్ మోతకి ప్రాణంమీది తీపితో..భీతితో
బంకర్లలోకి పరుగులెడుతున్నాయి
చదువో.. ఉద్యోగమో
బంగారు భవిత కోసం వచ్చిన
వలస పక్షులు సొంతగూటికి చేరడానికి
ఆందోళనతో దారులు వెతుకుతున్నాయి
చెమటోడ్చి రూపాన్నిచ్చిన
అందాల కట్టడాలు కొన్ని కూలిపోయాయి
మరికొన్ని పాక్షికంగా చచ్చుపడి, పొగచూరిపోయాయి
నిన్నటిదాకా పచ్చటి గడ్డి, చెట్లు పరచుకున్న స్థలాలు
రక్తమోడుతున్న శవాలతో స్మశానాన్ని తలపిస్తున్నాయి
నాయకుల ఉన్మాదానికి దేశాలు ఉనికి కోల్పోడం కొత్తకాదు
ప్రపంచ శాంతి కోరుకున్నట్టు నటించిన గోముఖాల
అసలు వికృత వ్యాఘ్ర రూపం ఒళ్ళు జలదరింపజేస్తోంది
యుద్ధకాంక్ష ముందు నోబెల్ శాంతి బహుమానాలు
దిగదుడుపులవుతున్నాయి
ఎప్పటిలాగే కాలిన, కూలిన దేహాల ఆత్మశాంతికి
రెండు క్షణాల మౌనం పాటిస్తూ
యుద్ధ సమాప్తి కోసం
పరితపిస్తూ..ప్రార్థిస్తూ..



-ప్రతాప వెంకట
సుబ్బారాయుడు
9393981918



## దేశ రక్ష'కులం'

హద్దులున్నాయి కాబట్టే గుండెకు హత్తుకొని
దురాక్రమణల్ని దునుమాడుతూ సంరక్షించుకోవాలి
జన్మనిచ్చిన నేలతల్లి కాబట్టే రక్షణకవచమై
పద్ధతిగా కాపుకాస్తూ మాతృఋణం తీర్చుకోవాలి
ఆ బాధ్యతాపరంపరే మేమెత్తుకున్న విధినిర్వహణ..

ఎంత గడ్డకట్టుక పోయే మంచైనా ఎగుడుదిగుడు
ఎత్తుపల్లాల నేలైనామాకు కొత్తేమీకాదు చేసేవృత్తికి
అండే కానీ మాకు అడ్డేమీ కాదు...

మేము చేసేది బ్రతుకుదెరువు వేటకాదు
కన్న వారినీ ఉన్న ఊరునూ కాదని
దేశభక్తినే ప్రవృత్తిగా చేస్తున్న వృత్తిధర్మం
కంటికిరెప్పలా దేశరక్షణ కోసం భక్తితో
అహోరాత్రులు జాగారాల దీక్షలు చేస్తున్నాం...

మీరక్కడ నిశ్చింతల క్షణాలు గడపాలంటే
మీరక్కడ ప్రశాంతగొడుగు కింద సేదదీరాలంటే
మేమిక్కడ క్షణం క్షణం పెయ్యంతా
కళ్ళుచేసుకుని కాపుకాయాలి...

ఇపుడు మీకు మా విన్నపం ఒక్కటే....
మీలో మీరే పుట్టుకతో వచ్చిన మచ్చుల
మత్తులో జోగిపోయి అంతర్గత కక్షలతో
పరాయివాడి ముందు చింపిన విస్తరికాకండి.
దొంగచాటుగా చొరబడ్డ దగాకోరు దుండగుల
విచ్చిన్న చేష్టలకు అండకాయకండి...

మేమిక్కడ క్షేమం
మీరక్కడ ఒక్కటై ఐక్యతాగీతాన్ని
సఖ్యతాభావంతో ఎలుగెత్తి చాటండి
అదే మాకు మీరిచ్చే నిండైన గుండెధైర్యం
అదే మాకు వెయ్యి ఏనుగులమనోస్థైర్యం...



- లక్ష్మణ్ మంచికట్ల
9494800112

## ఆధిపత్య జాడ్యం

ముసురుకున్న యుద్ధమేఘాలు
రానున్న రణ రంగానికి సాక్ష్యంలా...
తమ ఉనికిని చాటుకోవడానికి
దేశం చిన్నది అయినా
చేయక తప్పని పోరాటం...

చరిత్ర మాటున దాగిన సత్యాలంటూ....
అగ్రరాజ్యాల అంక్షల కత్తెర్లకు తలవొగ్గక..
మొండి వైఖరితో
ఆక్రమణకై ఉబలాట
పడుతున్న దేశం... ఓ వైపు

ప్రపంచ దేశాలు ఒక్కటైనా
నివారించలేని యుద్ధం...
కారణాలు ఏవైనా
ఆరంభమైన కదనం...
వేల ప్రాణాలను బలి కోరనున్న
ఆధిపత్య జాడ్యం...

గెలుపు ఎవరిదైనా
నష్టపోయేది సామాన్య పౌరులే
తప్పని ఆస్థి ప్రాణ నష్టాలు..
కోలుకోలేని దేశ ఆర్థిక పరిస్థితులు

గత యుద్ధ చరిత్రలను
గమనించినా కూడా
గుణ పాఠాలు నేర్వని దేశాలు
రానున్న కాలంలో
భారీ మూల్యం చెల్లించక తప్పదు



-కళావతి కందగట్ల
9948263004



## "స్నేహబంధం"

సృష్టిని నడిపే చైతన్యం స్నేహం !
లాభనష్టాలు బేరీజు వేసుకోకుండా..
ఆత్మీయులై జీవనం సాగించే అనుబంధం స్నేహం !

బతుకు పోరు లో ఎదురవుతున్న కష్టాలను
ఒక్కటిగా ఎదుర్కొనే ధైర్యం నేస్తం ..!
అసలు కష్టాలే రాకుండా కాపాడే రక్షణ కవచం స్నేహం !

ఇద్దరు గా వుంటున్నా ఆలోచనలు ఒక్కటిగా వుంటాయి !
దేహాలు వేరుగా వున్నా మనసులు ఒక్కటిగా వుంటాయి !

నిస్వార్థమైన స్నేహం లోకానికి ఆదర్శమవుతున్న వేళ ...
స్నేహబంధం మధురమైనది !
స్నేహబంధం మహిమాన్వితమైనది !

-గొర్రెపాటి శ్రీను
9652832290

## నేటి బంధాలు

బంధాలతో ముడిపడి..
జీవితము ఉండును.
భారంగా ఉన్నా..
బలే గమ్మత్తుగుండును..
వారెవ్వా మనిషి జీవితము..
సుడిగుండాల మయము..

చూడముచ్చటగున్న..
సూటి పోటి మాటలంటరు..
కష్టములలో ఉన్నా..
కన్నీరు కార్చరు..
ఏమిటీ బంధాలు..
ఎన్నెన్నో విచిత్రాలు..

మన ముందున్నప్పుడు..
మనకై మాట్లాడుతరు..
మన వెనకాలునప్పుడు...
మనకెన్నుపోటు పొడుస్తరు..
వారెవ్వా మనిషి బంధాలు..
మానవత్వం లేకుండెను...

అబద్ధాలాడువారికి...
అందరు చుట్టాలే..
నిజాయితీగున్నోడికి..
అన్నీ గండాలే...
ఏమిటో ఈ సమాజము..
సక్కగున్నోడికి చుక్కలు చూపెను...

నీతి నిజాయితీలను..
ఎన్నడు మరువకుము..
నీ నైపుణ్యాలనెపుడు..
తేలికగ చేసుకోకు...
నీపై నీవు నమ్మకముంచుకో..
ధైర్యముతో ముందుకు నడువు..



-పసుల.శంకర్
9542181301

పుస్తక సమీక్షలు

## ఒక చారిత్రక సౌందర్యం 'లకుమ'

పేరెన్నిక గన్న ఎన్నో గ్రంథాలను, తెలంగాణలో కనుమరుగైన కళాకారులను, కళలను, సాహిత్యాన్ని, తెలంగాణ వీరగాధలను, విరోచిత విషయాలను తెరమీదకు తెచ్చి, వాటికి ఒక గ్రంథ రూపాన్నిచ్చి రాబోయే తరాలకు ఎంతో ఉపయుక్తంగా తీర్చిదిద్దే విషయంలో తెలంగాణ సాహిత్య అకాడమి ముందంజలో ఉన్న విషయం పాఠకులకు విదితమే. ఆ కృషి లోని భాగమే ఈ నవలిక "లకుమ".

"లకుమ' ఒక నర్తకి.. నాట్యశాస్త్రానికే వన్నెతెచ్చిన నాట్యం "వసంత రాజీయం". నాట్యానికి, నర్తకీ మణులకు, నాట్యకళాకారులకు ఈ నాట్యం ఒక ప్రేరణ. "లకుమ" జీవితం నాట్యానికే అంకితమయింది. ఈ నాట్యం ద్వారా దేశానికి, కళకు ప్రాణత్యాగం చేసారు ఆమె. అతి తక్కువ జీవితాన్ని పొందిన ఆమె కళకు ఒక దర్పణంగా నిలిచిపో యారు. ఇలా చారిత్మాత్మకమైన ఈ నర్తకి 'లకుమ'





జీవితాన్ని నవలికగా రూపొందించారు మన నాట్యశాస్త్ర వేత్త నటరాజ రామకృష్ణ. వారికి మన:పూర్వక అభినందనలు.

కొండవీటి రాజు కుమారగిరి రాయలు ప్రతి యేటా జరిపే వసంతోత్సవాలతో రచించిన ఈ కావ్యం మన కవి, మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు "కర్పూర వసంతరాయలు" అనే గేయకావ్యం తెలుగు సాహిత్య చరిత్రలో తెలియనివారు ఉండరు. ఇందులోని 'లకుమ' ఇప్పుడు రచించిన నర్తకి 'లకుమ' ఇద్దరూ ఒకరే.. కాకుంటే అది కావ్యం. ఇది వచనం, కథా రూపంలో పాఠకులకు అర్థమయ్యేతీరులో ఉంది. కాటమవేముడు, దొరపరెడ్డి, కుమారగిరి, మల్లెమ దేవదాసి, వీర రాఘవయ్య నాట్యాచార్యుడు, లకుమ పాత్రలతో నడిచిన ఈ కథాగమనం ఎంతో హృద్యంగా సాగింది.

కళాతపస్వి 'లకుమ' దేవదాసిగా దేవతలకే కళను అంకితం చేసిన నర్తకీమణి. నాట్యశాస్త్రాన్నే వెలువరించే రాజుకు తన కళను ప్రదర్శించి కళాకారిణిలాగే జీవించి, ఎటువంటి కళంకం లేకుండా తనువు చాలించిన ఆమె ఆదర్శం గురించి ఈ నవలికలో చదువుతుంటే ఎంతో ఉదాత్తంగా అనిపించింది. ఈ రోజుల్లో ఇలాంటి వారిని గురించిన విషయాలను గ్రంథీకరిం చడం అనేది సమాజానికి ఎంతో అవస రం. కాల గమనంలో కొట్టుకుపోతున్న ఇటువంటి ఎందరో ఉదాత్తులు మనకు చాలా తక్కువ మంది ఉంటారు. ఈ నవ లికలో నాట్యరీతులు, నాట్యశాస్త్ర విశే షాలు, ఉత్సవాల నిర్వహణలు, రాజ భవనాల సౌందర్యాలు, రాజ్యంలోని మ ర్యాద తీరులు వంటి చారిత్రక విషయా లను ఈ నవలికలో మన కళ్ళముందుం చారు నటరాజ రామకృష్ణ. అప్పటి కథలు, సన్నివేశాలకు, పాత్రలకు భాష, గొప్ప శైలిని కలిపి మనకు అందించిన ఈ రచయితకు అభినందనలు,,

**ప్రతులకు:**
తెలంగాణ సాహిత్య అకాడమి,
ఫోన్: 040-27678411



-శైలజామిత్ర
9290900879

## చిక్కు ప్రశ్న...?

నేడు కళ్ళెందుకు చెమ్మగిల్లాయని
కనురెప్పలను అడగకు...

నిన్న పగిలిన ఆ గుండెకు
గుచ్చుకున్న ఆ గునపాలనడుగు...
తగిలి మానని ఆ గాయాలనడుగు...

రగులుతున్న గుండెలో బ్రద్దలౌతున్న
ఆ ఆవేదనా అగ్నిపర్వతాలనడుగు...
ఆ కళ్ళెందుకు వర్షిస్తున్నాయో....ధారగా

అందమైన ఆ బాపుబొమ్మ
అందాల ఆ చందురూడే
అసూయచెందే చిలకపలుకుల
ఆ రంగుల రామచిలకను
పెళ్ళెందుకాలేదని అడగకు...

అధిక కట్నాలకోసం పిల్లల్ని పట్నాలకి
అమెరికా ఆస్ట్రేలియాలకు పంపుతున్న
ఆశబోతులైన అమ్మానాన్నలనడుగు...

పబ్బులకు క్లబ్బులకు డబ్బులు తగలేస్తూ
విందు వినోదాలంటూ విచ్చలవిడిగా తిరుగుతూ
సంతలో సరుకులా అమ్ముడుపోతున్న
ఆ ఆశబోతు ఆధునిక యువతనడుగు...

ఆ చిట్టి చిలకమ్మ చిమ్మచీకటిలో ఒంటరిగా
కూర్చొని ఎందుకు చింతిస్తున్నదో...పాపం

-పోలయ్య కవి
కూకట్లపల్లి
9110784502

## పరనింద

చచ్చేపామును ఇంకా చంపాలని చూడకు,
అది నీ అసమర్థతే అవుతుంది
పరుల మనసులను పీడించాలని చూడకు
అది నీ వ్యక్తిత్వానికి తీరని మచ్చ కాగలదు,
పరుల మదిని గాయం చేయాలని చూడకు,
అది నీ భవితకు గొడ్డలి పెట్టువంటిది,
తేనె పూసిన కత్తులున్న నేటి
సమాజంలో నువుచురకత్తివి కాకు,
అది నిన్ను నిలువునా గాయం
చేయక మానదు,
పరుల జీవితంలోకి తొంగి చూడకు
ఎన్నో ఎన్నెన్నో ఎదగాయాలు
నీ కగుపించును,
ఆ మదిలో నిమగ్నమైయున్న
కోరికలను కదపాలనియత్నించకు
అవి తిరగబడి తేనెటీగల్లా
నిను చుట్టుముట్టే ప్రమాదం ఉంది,
మిన్ను విరిగి మీద పడినా
పరులను హేళన చేయాలని చూడకు
అంతకు మునుపే నిన్ను
నువ్వు సరి దిద్దుకో.



-రాయవరపు సరస్వతి
9885656356

## మా పెరటి తోట

మా పెరడు చూడ
ఇలనస్వర్గమంటే నమ్ము.

మా పెరటి జాం చెట్టున
కాయలు పెద్దముంతడు
కొబ్బరి చెట్టు చూడ
ఆకాశం తాకుతుంది.

గులాబి మొక్క చిట్టడివిలా
పూలు కోయ ముళ్ళు బాకుల్లా
మల్లె, సన్నజాజి గుభాళింపు
ఊరుమొగసాల వరకు వ్యాపించు.

తోటలోని పూల రంగులు
హరివిల్లు వర్ణాలు
మడుగులో తామరలసోయగం
గుడిలో అమ్మ పాద పద్మాలు.

పక్షుల కిలకిల రావాలు విన
వీణా,కంజీర స్వరవిన్యాసాలు
నేరెడు,రేగు పండ్లు తిన
పిల్లల మల్లయుద్ధాలు ఉదయాన.

బత్తాయి చూడ బానంత
పప్పాయ చూడ పనసంత
గుమ్మడి కోసం ఊరి పెద్ద పడిగాపు
అది చూసి పాలెగాండ్ల సకిలింపు.

సాయం సంధ్య వేళలో
వేపకొమ్మకు కట్టిన ఊయలూగుతుంటే
సూర్యుడు అక్కసుతో ఎర్రబడి
ఆకాశమంతా అరుణవర్ణమయం.



-సి. హేమలత
9666779103

## బుజ్జి కుందేలు పాట (కథ)

ఒక బుజ్జి కుందేలుకు మాటలు చక్కగా రావు. అది అన్న మాటలనే తిరిగి మరలా మరలా అనేది. అన్ని జంతువులు దీన్ని అలుసుగా తీసుకొని దాన్ని గేలి చేస్తూ ఉండేవి .

ఒకసారి మృగరాజు సింహం జంతువులతో సమావేశం ఏర్పాటు చేసి "నా ప్రియమైన జంతువులారా! మన పొరుగు అడవి సింహం తమ అడవిలో పాటల పోటీ ఏర్పాటు చేసిందని తెలిసింది. అది మనను ఈ పోటీలకు ఆహ్వానించింది. అది కేవలం జంతువులకు మాత్రమే. మీరంతా వెళ్లి ఈ పోటీల్లో పాల్గొని విజయాన్ని సాధించి మన అడవికి పేరు తేవాలి " అని కోరింది. అప్పుడు జంతువులన్నీ సరేనన్నాయి. ఈ పోటీలకు ఇతర జంతువులతో పాటు తల్లి కుందేలు కూడా తన బిడ్డతో బయలుదేరింది.

ఆ పోటీలకు వివిధ అడవుల నుండి అనేక జంతువులు వచ్చాయి. సింహం అధ్యక్షతన పాటల పోటీ మొదలైంది .అన్ని జంతువులు ఈ పోటీలో పాల్గొన్నాయి .అన్ని పాడటం పూర్తి అయిన పిదప సింహం "ఇంకా ఎవరైనా పాట పాడేవారు ఉన్నారా! ఇప్పటికైనా వారు వచ్చి పాడవచ్చు" అని అంది. అప్పుడు బుజ్జి కుందేలు తన తల్లితో "అమ్మా!నేను వెళ్లి ఒక పాట పాడనా "అని అడిగింది. దాని సంగతి తెలిసిన బుజ్జికుందేలు తల్లి " వద్దు బిడ్డా! నీవు మాట్లాడితేనే అవమానాల పాలు అవుతున్నావు .ఇక పాట పాడితే అన్నీ నవ్వుతాయి.అంతేకాకుండా ఇక్కడ వివిధ అడవుల నుండి వచ్చిన జంతువుల ముందు ఇంకా చులకన అవుతావు" అని అంది .ఈ మాటలు విని బుజ్జి కుందేలు గురించి తెలిసిన జంతువులన్నీ నవ్వాయి.

బుజ్జి కుందేలుకు ఉక్రోషం, పట్టుదల ఎక్కువై లేచి "నేను పాడతాను మృగరాజా !"అని గట్టిగా అంది. దీని సంగతి తెలిసిన జంతువులన్నీ తిరిగి నవ్వాయి. సింహం దాన్ని రమ్మని ఆహ్వానించింది .బుజ్జి కుందేలు వెళ్లి పాడడం ప్రారంభించింది. విచిత్రం .అది చాలా అద్భుతంగా పాడింది. అది పాడినంతవరకు జంతువులన్నీ కళ్ళు మూసుకొని దాని పాటకు పరవశించి పోయాయి. అడవి జంతువులు అన్నీ విశేషించి కుందేలు నివసిస్తున్న అడవి జంతువులు కూడా చాలా ఆశ్చర్యపోయాయి. దాన్ని విజేతగా సింహం ప్రకటించింది .దాంతో తల్లి కుందేలు ఆనందానికి అవధి లేదు. అది తన బిడ్డను ప్రేమతో అభినందించింది.

ఆ తర్వాత విజయ ఢంకా మోగించి అడవికి తిరిగి వచ్చిన బుజ్జి కుందేలును ఈ అడవి సింహం అభినందించి గొప్పగా సత్కరించింది. దాని మాటలను వేళాకోళం చేసిన జంతువులన్నీ అప్పుడు సిగ్గు పడ్డాయి .ఆ తర్వాత అది కోకిల తనకు సంగీతం నేర్పినట్లు తన తల్లికి చెప్పింది. అందుకే ఇతరుల శక్తి సామర్థ్యాలు తెలుసుకోకుండా వారిని గేలి చేయరాదు.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

## సాక్ష్యం

క్షణక్షణం వెతుకుతున్న
క్షణాల్లోకిచొరబడి దేవులాడుతున్న
చీకట్లుకమ్ముకున్న జీవితంలో
కళ్ళలో ఆశల దీపాలను వెలిగించుకొని
అణువణువు అన్వేషిస్తున్న
ఆవగింజంతఅదృష్టం ఎక్కడదాక్కుందో అని.

చెమటదారలు కాలువలై ప్రవహిస్తున్నాయి.
పడకేసిన పేదరికంమాత్రం...
ఇంకా గురకపెట్టి నిద్రలో మునిగిపోయింది.
ఆనందపు పూలన్నీ రాలిపోతున్నాయి.
కష్టాల గుట్టలన్నీ పేరుకుపోతున్నాయి.
శ్రమజీవుల నెత్తురంత
కాలువలై పారుతున్నాయి.
స్వేదపు చుక్కలు ధనవంతుని చేలలో నిండి
విరగబూసిన ధనరాసులై....
కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి.

ఎదలో గంపెడు ఆశలు నింపుకొని
కార్మికుడు తన కష్టాన్ని కరిగించి...
డొక్కలెండిపోయిన రెక్కలతో..
నాలుగుమెతుకుల వేట కోసం
బతుకుపోరు సాగిస్తున్నాడు.
ఒక మనిషిగా ఎవరు
తన కష్టాన్ని గుర్తించరు.
మానవత్వం ఉన్న మనుషులై ఎవరు...
తన కడుపుకోతను ఆలోచించరు.
శ్రమదోపిడికి ఈ మనుషులెవరు
సాక్ష్యం కారు.
అతని కష్టాన్ని చూసి
నిచ్చలంగా ఉండిపోయిన
ఆకాశమే సాక్ష్యం..
ఆవిరైన కష్టాల కన్నీళ్ళని
తనలో నింపుకున్న మేఘాలే సాక్ష్యం...
తన ఎదపై నిలిపుకొని జోలపాడుతున్న
పుడమి తల్లి సాక్ష్యం...
అలా పచ్చని పైరుల పైనుండి విస్తూ...
నీకు ఉపిరిపోస్తున్న చల్లని గాలి సాక్ష్యం.
నీ మదిలో బడబాగ్ని ఎగసిపడుతున్న
నిప్పు కనికలే సాక్ష్యం.

ఈ మనుషులు నిను మరిచిపోతారేమో
కానీ... నిను అక్కున చేర్చుకొని
పెంచుతున్న
ఈ ప్రకృతి మాత్రం
నిను ఎప్పుడు మర్చిపోదు.
అన్వేషించు అణువణువు.
ఎక్కడో ఒకచోట..నీకోసం ఈ కాలం
విజయపు కాగడాలను పట్టుకొని
వేచిచుస్తూనే ఉంది.



-అశోక్ గోనె
9441317361

